

www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023





'ఆదాల'కు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు :వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం నగరంలోని ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయానికి చేరుకున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి పుట్టిన రోజు అభినందనలు తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఉన్నారు.



కరువు మండలాలను ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం జిల్లా నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో కరువు మండలాలను ప్రభుత్వం తక్షణమే ప్రకటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు కోరారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ నేతృత్వంలో బుధవారం ఆ పార్టీ నేతలు కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను కలిశారు. ఇటీవల జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో వారి దృష్టికి వచ్చిన పలు అంశాలు, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధిని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు రామాయపట్నం, ఉదయగిరి, పొదలకూరు మూడు ప్రాంతాల నుంచి నిర్వహించగా అనేక అంశాలను ప్రజలు తమ ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. వాటన్నింటిని కలెక్టర్ ఎం.హరినారాయణన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జిల్లాలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో , మరో పక్క ప్రాజెక్టులలో నీరు లేకపోవడంతో కరువు మండలాలు అధికంగా ఉన్నాయన్నారు. ఉలవపాడు, గుడ్లూరు,కందుకూరు, లింగసముద్రం, ఒలేటివారి పాళెం, కొండాపురం, కలిగిరి, జలదంకి, సైదాపురం, రాపూరు, ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు దుత్తలూరు, మర్రిపాడు తదితర ప్రాంతాల్లో రైతులు పంటసాగుబడి చేసేందుకు అవసరమైన నీరు లేకపోవడంతో బీడువారిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా వ్యాప్తంగా విచారణ చేసి కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు సమస్యలు ముఖ్యంగా సోమశిల ప్రాజెక్టుకు చెందిన అప్రాన్ మరమ్మత్తులకు గుర్తై ఏడాది పూర్తి కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించలేదన్నారు. ఈ పనులు నిర్వహించేందుకు వంద కోట్లకు టెండర్‌ను సొంతం చేసుకొని పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలో వదిలి వెళ్ళిపోయారన్నారు. వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వస్తే రక్షణ కవచం అయిన అప్రాన్ మరమ్మత్తులకు గురైన కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అటువంటి ప్రమాదం ఏదైనా చోటు చేసుకుంటే జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుదన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ కింద నాలుగు మండలాలు వింజమూరు,దుత్తలూరు, మర్రిపాడు తదితర ప్రాంతాలకు సాగునీరు, త్రాగు నీరు సరఫరాకు ఉపయోగపడుతుందని, ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సోమశిల ఉత్తర కాలువ వెడల్పు చేసి రాళ్లపాడు ప్రాజెక్టు కు నీరు అందించగలిగితే పూలేటి వారిపాళెం, లింగసముద్రం, కొండాపురం,కలిగిరి ప్రాంతాల్లో పంటలు పండేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. రామయపట్నం పోర్టు నిర్మాణ పనులకు ప్రభుత్వం రైతుల నుంచి భూమి తీసుకొని సరైన నష్టపరిహారం అందజేయలేదని, 2013 భూ సేకరణ చట్టాని అనుసరించి ప్రభుత్వం రైతులకు అందజేయాల్సిన నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదిన కలెక్టరేట్ ఎదుట ఆ ప్రాంత రైతాంగం ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. క్రిష్ణాపట్నం, రామాయపట్నం ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న యువతకు వందకు డెబ్బైయైదు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపని పక్షంలో ఆందోళన చేసేందుకు సిపిఎం సిద్ధమౌతుందన్నారు. భోగోలు మండలంలో ఇంజన్లు తయారు చేసే పరిశ్రమ మూతపడి ఉందని, ఆ పరిశ్రమను తెరిపించేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు.ఆత్మకూరు పరిశ్రమల స్థాపనకు భూసేకరణ చేశారని, ఇప్పటి వరకు పరిశ్రమలు స్థాపించిన పాపాన పోలేదన్నారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న యువత ఉపాధి నిమిత్తం చెన్నయ్, బెంగుళూరు, హైదరాబాదు తదితర నగరాలకు వలస పోతున్నారన్నారు. వెంటనే ఆ ప్రాంతంలో పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రధానంగా ఎస్‌సి,ఎస్‌టి వర్గాలు జీవిస్తున్న ప్రాంతాల్లో స్మశాన వాటికలు లేవని, వారికి భూములు లేవని, ల్యాండ్ పర్చేజి పథకం కింద కొనుగోలు చేసి భూ పంపిణీ చేయాలన్నారు. ముత్తుకూరు మండల పరిధిలోని నక్కలకాలువ ప్రాంతం , వెంకటాచలం వంటి మునక ప్రాంతాల్లో కలువుల్లో పూడిక తీసి అక్కడ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బండేపల్లి ప్రాంతంలో ఉన్న కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాలన్నారు. రాబోవు కాలంలో జిల్లాలో పరిశ్రమలు స్థాపించి, రైతులు పంటలు పండించుకొనేందుకు అనుకూల వాతావరణం కల్పించి పారిశ్రా మికంగా అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సమస్యల పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటి సాధించుకొనేందుకు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో దశల వారీ పోరాటానికి సిద్ధపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, ఎస్‌కె రెహనాబేగం, ఎస్‌కె మస్తాన్‌బీ, కత్తి శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, కొండా ప్రసాద్, జి.శేషయ్య, టి.వి.వి. ప్రసాద్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నేతలు



కలెక్టర్‌ను కలిసిన డిఆర్‌ఓ లవన్న

డిఆర్‌ఓ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా నూతన రెవెన్యు డివిజన్ అధికారిగా ఎస్.లవన్న బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిఆర్‌ఓగా పని చేసిన సి.వెంకట నారాయణమ్మ నుంచి బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎం. హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డిఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన లవన్న మీడియాతో మాట్లాడుతూ గతంలో చిత్తూరు కలెక్టర్‌గా ఎం .హరి నారయణన్ పనిచేస్తున్న సమయంలో తాను ఆ ప్రాంతంలో గతంలో గుంతకల్లులో ఆర్‌డిఒగా పనిచేశామన్నారు. డిఆర్‌ఓగా జిల్లాకు తాను బదిలీ అయి రావడం.. ఈ ప్రాంతంలో కలెక్టర్‌గా ఎం.హరినారాయణన్ పనిచేస్తుండటం సంతోషకరంగా ఉందన్నారు. తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని, అందరితో సన్నిహితంగా ఉంటూ , ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు అతీతంగా విధులు నిర్వహిస్తామన్నారు.

ఈవిఎంలు తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గడువులోగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు తనిఖీ పూర్తిచేయాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద ఉన్న ఓటింగ్ యంత్రాల గోడౌన్లో ఈవీఎంల పర్యవేక్షణ అధికారి , బెల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈవీఎంల తనిఖీ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియలో వినియోగించే ఈవీఎంలు తనిఖీ పకడ్బందీగా , జాగ్రత్తగా చేయాలని సూచించారు. వచ్చే నెల 10వ తేదీలోగా ఈవీఎంల తనిఖీ పూర్తి చేయాలన్నారు.



ఈవీఎం మిషన్లో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే వాటిని వేరుగా భద్రపరచాలని సూచించారు. తనిఖీలలో డిఆర్‌ఎస్ .లవన్న, ఆర్డీవో మాలోల, ఈవీఎం ల సూపర్వైజర్ సుధాకర్ రావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై

నేడు చర్చా గోష్టి

నెల్లూరు :జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో నేడు నగరంలోని డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్ హాలులో ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివద్ధిపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్చా గోష్టిని రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చర్చాగోష్టిని ప్రారంభిస్తారన్నారు. వక్తలుగా మాజీ మంత్రి వర్యులు వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి యం.రమేష్, ప్రజాసైన్స్ ఉద్యమనేత జి.మాల్యాద్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

సాగునీరు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

జాఫర్ సా కాలువ, సర్వేపల్లి కాలవ ద్వారా పంటసాగుబడి చేసుకొనే రైతంగానికి నీటి సరఫరా చేయాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కన్వీనర్ షానవాజ్ మాట్లాడుతూ వర్షపు నీరు ద్వారా రైతాంగానికి నీరు అందే సమయంలో జాఫర్ సా, కాలువ సర్వేపల్లి కాలువలకు ప్రభుత్వం సైడ్ వాల్స్ నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. వాస్తవానికి మార్చి నెలలో మొదలుపెట్టి పూర్తి చేయాల్సిన పనిని ఆలస్యంగా ప్రారంభించడం వల్ల రైతాంగం నష్టపోయిందన్నారు. అక్టోబర్, నవంబర్లో డివైడ్లు కట్టుకుంటూ మట్టి అడ్డం వేసేస్తూ రైతులు నవంబర్ నెల నుంచి వరి సాగు చేసుకోవాల్సి ఉండగా కాలువకి మట్టిని అడ్డంగా వేసి విధంగా అధికారులు, ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ విధంగా వ్యవహరించడం వల్ల ఇందుకూరుపేట, తోటపల్లి గూడూర, ముత్తుకూరు, వెంకటాచలంఈ నాలుగు మండలాలు రైతులు పంటలు సాగుబడి చేసుకొనే అవకాశం లేక ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. తక్షణమే జిల్లా ఉన్నత అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఆది, వెంకటసుబ్బయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మంత్రి రోజా వ్యాఖ్యలు సరికాదు : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిపట్ల వ్యంగ్యంగా మాట్లాడిన మంత్రి ఆర్‌కె రోజా నోరు అదుపులో పెట్టుకోవాలని కందుకూరు పట్టణం తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ హెచ్చరించారు. బుధవారం ఆమె ఇక్కడ మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరాధారమైన ఆరోపణలతో సిఐడి పోలీసులను ఉపయోగించి అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి "నిజం గెలవాలి" అనే పేరుతో బస్సుయాత్ర ద్వారా ప్రజల్లోకి వస్తుంటే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నెముకలో వణుకు పుడుతుందన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టుచేశారనే ఆవేదనతో గుండెలు ఆగిపోయి మతిచెందిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు "నిజం గెలవాలి" బస్సుయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.



కల్లూరి శైలజ

ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు :చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో నేను కార్యక్రమాన్ని కందుకూరు పట్టణం 18వ వార్డు ఉర్దూ పాఠశాల పరిధిలో బుధవారం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంచారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ 18వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, స్థానికులు దోమలు, విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ముస్లి ములకు మేలు ఏమీ జరగలేదన్నారు. ఏ ఇంటికి వెళ్లినా సమస్యల గురించి చెబుతూ ఆవేదన చెందుతున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో లాగా ఈ ప్రభుత్వంలో అభివద్ధి జరగడం లేదన్నారు. తమ గురించి స్థానిక ఎంఎల్‌ఎ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక యువకులు నాగేశ్వరరావు దష్టికి తెచ్చారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు నగర జయకష్ణ నాయకులు రావి జాలయ్య, సయ్యద్ జియావుద్దీన్, షేక్ రాహుల్, మహబూబ్ బాషా, గనిపినేని నరసిం హారావు, సుభాని, ఫాజిల్, రబ్బాని, బాబు చంటి, సోహెల్, అహ్మద్, మోహిసిన్, ఆరాఫత్, బాబు (బిఎస్‌ఎన్‌ఎల్), మహబూబ్ బాషా, కరీముల్లా, యాసీన్, సుల్తాన్, ఫైరోస్, దేవా, నాయకులు చదలవాడ కొండయ్య, వి రవిచంద్ర, రాయపాటి శ్రీనివాసరావు, షేక్ రఫీ, షేక్ సలాం ఉన్నారు.



సౌత్ ఆములూరులో అక్రమ లే అవుట్లు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

విచ్చలవిడిగా అక్రమ లే అవు ట్లు వెలుస్తున్నాయి. నిబంధన లు తిలోదకాలిచ్చి ఏర్పాటు చే సున్న ఈ అక్రమ లే అవుట్ల వి షయంలో అధికారులు అనుస రిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల వి మర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో రియ ల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది.రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్ర భుత్వ నిబంధనలను తుంగ లో తొక్కి ఇష్టారాజ్యంగా వెంచ ర్లు వేస్తున్నారు. ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకొని లే అవుట్లు నిర్మించగా మరికొందరు ఏకంగా ప్రభుత్వ భూముల్లో వెంచర్లు సిద్ధం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం రియల్ వ్యాపారుల దందా యథేచ్ఛగా కొనసాగుతోందని చెబు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అక్రమ లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

ఘనంగా దసరా వేడుకలు

ప్రజాశక్తి -కందుకూరు

శింగరాయకొండ సాయిబాబా మందిరంలో 105వ పుణ్యతిథి సందర్భంగా మంగళవారం విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. తొలుత వందలాది మహిళలు పంచ హారతులు సమర్పించారు. చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ కొల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. దేవి సీ ఫుడ్స్ పి.బ్రహ్మానందం, సూర్యవతీల సహకారంతో మధ్యాహ్నం వేలాదిమందికి అన్నదాన అన్నదానం జరిగిందని ట్రస్ట్ సభ్యులు సుబ్బరాజు వెల్లడించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ దశాబ్దాల తరబడి విజయదశమి లాంటి పర్వదినాలతోపాటు వార్షికోత్సవాలను ఘనంగా జరపడం నిర్వాహకుల కషి అభినందనీయమన్నారు.

హత్య కేసులో ఏడుగురికి శిక్ష

ప్రజాశక్తి-కందుకూరు :కోర్టులో ట్రయల్ జరుగుతున్న కేసులపై ఎస్‌పి మలిక గర్గ్ ప్రత్యేక దష్టి సారించి గుడ్ ట్రయిల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ పోలీస్ అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో తరుచూ సమీక్ష సమావేశాలు నిర్వహించి సమన్లు జారీ, సాక్ష్యాధారాల సమర్పణ, సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టుట తదితర అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా పలు కేసులలో నిందితులకు కోర్టులు కఠిన శిక్షలు విధిస్తున్నాయి. 2012లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సంచలనం కలిగించిన కందుకూరుకు చెందిన ఒక యువతి, ఒక యువకుడు కులాంతర వివాహం చేసుకోవడం అవమానంగా భావించిన యువతి తండ్రి పోమిశెట్టి సుబ్బారావు, తమ్ముడు ఉదయ్ సాగర్ ఆ యువకునిపై, వారి వివాహానికి సపోర్ట్ చేసిన అతని సోదరుడు బోపిడి స్వామి (30) పై కక్షి పెట్టుకుని 23.06. 2012న ఓ పథకం ప్రకారం ఏడుగురు కలిసి స్వామిని బలవంతంగా ఆటోలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు. స్వామి మృతదేహాన్ని పొన్నలూరు సమీపంలోని పొలాల్లో పూడ్చి వేసి సాక్ష్యాలను తారుమారు చేసిన ఘటనలో పొన్నలూరు పిఎస్‌లో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు పంపించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిహెచ్ రమేష్ బాబు ద్వారా నిందితులను కోర్ట్ ముందు ప్రవేశపెట్టి సమయానుసారం సాక్షులను కోర్టులో హాజరుపరుస్తూ ఎస్‌పి మార్గదర్శకత్వంలో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా ట్రయల్ నడిపారు. సరైన సాక్ష్యాధారాలతో ఏడుగురు నిందితులపై నేరారోపణ నిజం కావడంతో ఒంగోలు జిలా సెషన్స్ జడ్జి డి.అమ్మన రాజా హత్య నేరం కింద ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, రూ. 1000 జరిమానా, కిడ్నాప్ నేరం కింద ఏడుగురికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సాక్ష్యాలను తారుమారు చేసిన నేరం కింద ముగ్గురుకి ఏడేళ్ల జైలు శిక్ష రూ1000 జరిమానా విధించారు. ఈ శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పు చెప్పింది. సరైన సాక్ష్యాధారాలు కోర్ట్ లో ప్రవేశపెట్టి సమర్ధవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితులకు శిక్షపడటంలో క్రియాశీలకంగా పనిచేసిన అప్పటి కందుకూరు సిఐలు పి. కరు ణాకర్, పి.అక్కేశ్వరావు, ప్రస్తుతం కొండేపి సిఐ పాండు రంగారావు, పొన్నలూరు ఎస్‌ఐ రాజా రావు, అప్పటి ఎస్‌ఐ శ్రీహరి, అడిషనల్ పిపి రమేష్ బాబు, కోర్ట్ లైజన్ ఎఎస్‌క్మి సత్య శ్రీనివాస్, పొన్న లూరు కోర్టు ఎఎస్‌ఐ బాలకష్ణ మూర్తి రమణయ్యలను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

'సిఎంఆర్ చందన' ఆఫర్లు

బైక్ విజేత సురేష్


నెల్లూరు అర్బన్ :దసరా, దీపావళి సందర్భంగా 'సిఎంఆర్ చందన' ప్రవేశపెట్టిన గిఫ్ట్ ఆఫర్లు ప్రవేశపెట్టింది. బుధవారం జరిగిన హీరో మోటార్ బైక్ నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కొచ్చిన్ పార్టీ డ్రెస్ మాజీ డైరెక్టర్ పత్తి రవీంద్రబాబు డ్రా తీశారు. బి సురేష్ కూపన్ నెంబర్: 61372 (గూడూరు) విజేతగా ప్రకటించారు గతవారం మోటార్ బైక్ విజేతకు హీరో మోటర్ బైక్ అందజేశారు. గతవారం జీతాలు 35 మందికి గ్రైండర్ మిక్సీ కుక్కర్ ఇండక్షన్ స్టవ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రూ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అంత పెద్ద వస్త్ర సంస్థ అయిన 'సిఎంఆర్ చందన'లో అత్యంత తక్కువ ధరలకే అమ్మడంతో పాటు వినియోగదారులకు పండుగల సందర్భంగా అత్యంత విలువైన మోటర్ బైక్స్ కార్లు, గహపకరణాలు అందజేయడం ఆనందాయకమన్నారు. తక్కువ లాభ ప్రేక్షతో వస్త్రాలు, బంగారు ఆభరణాలు అందించడంతోపాటు వినియో గదారులకు ఖరీదైన బహుమతులు అభినందనీయమన్నారు. కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ మాజీ డైరెక్టర్ శ్రీ పి రవీంద్రబాబు మాట్లాడుతూ 20 ఏళ్లకు పైబడి నెల్లూరులో నెలకొల్పిన చందనా బ్రదర్స్ సిఎంఆర్ సంస్థలు సింహపురి ప్రజలలో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నాయన్నారు. రాజీ యాడ్స్ మోపూరు పెంచలయ్య శైలేష్ మేనేజర్ వాసు ఉన్నారు.



బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

'జగనన్న సురక్ష'తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - లింగసముద్రం : పెంట్రాల సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఐదుగురు వైద్యుల బృందం ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేసింది. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపిడిఒ శేషుబాబు మాట్లాడుతూ ప్రజలకు మేరుగైన వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం తీసు కొచ్చినట్లు తెలిపారు. అ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డాక్టర్ అనూరాధ ఆధ్వర్యంలో డాక్టర్ వర్షిత,డాక్టర్ మౌనిక,డాక్టర్ పేరయ్య,డాక్టర్ సమీర్‌లతో కూడిన బృందం ప్రజలకు పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి . ప్ర సా ద్ , సి హె చ్ ఓ శ్రీనివాసులు,పెంట్రాల సర్పంచ్ బాబురావు, వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి,జెసిఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్ణారెడ్డి,ఎఎంసి వైస్ చైర్మన్ మేకనబోయిన శ్రీనివాసులు,సర్పంచ్‌లు దామా సీతారా మయ్య,డబుగొట్టు మల్లిఖార్జున,వంటేల శ్రీనువాసులు, వైసిపి నాయకులు మాచేపల్లి మాల్యాద్రి,అల్లం రాజేష్,వంకాయపాటి వెంకటేశ్వర్లు,పంచాయితీ కార్యదర్శి మాధవరావు ఉన్నారు.



ఆరోగ్యశ్రీ సేవలు మెరుగు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు మెరుగుపడేలా కషి చేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ హరి నారాయణన్, కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో వైద్యాధికారులతో సమావేశమై, జిల్లాలోని అన్నీ ప్రభుత్వ అస్సుపత్రుల్లో ఆరోగ్య శ్రీ పథకం క్రింద జరుగుచున్న వైద్య సేవలు 'న్యూట్రిషన్ రీహేబిలిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ) ఏర్పాటు పై సమీక్షించి, పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు మెరుగుపడేలా కషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి పేషెంట్ కు మెరుగైన వైద్య సేవలను అందించడంతో పాటు ఆరోగ్య శ్రీ పథకం పరిధిలోకి వచ్చే పేషెంట్ వివరాలను రిజిస్ట్రేషన్ నుండి డిశ్చార్ వరకు పేషెంట్ వారిగా స్టేజీ వారిగా వారి వివరాలను ఆన్ లైన్ లో కచ్చితంగా నమోదు అయ్యేలా సంబంధిత వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పెంచలయ్య, డిసిహెచ్‌ఎస్ డా. రమేష్ నాథ్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. సిద్దా , ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డా. చంద్ర శేఖర్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా -యువకుడు మృతి

ప్రజాశక్తి- కందుకూరు :కందుకూరు పట్టణ పరిధిలోని జరుగుతున్న హైవే పనుల్లో బుధవారం అపశతి చోటుచేసుకుంది.అనందపురం-గనిగుంట మధ్య రోడ్డు పనులు చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది .కష్ణాజిల్లా నందిగామ కు చెందిన మంద అభినయ్(17)హైవేకు క్యూరింగ్ నీళ్ల పడుతుండగా ట్రాక్టర్ తిరగబడటంతో అక్కడికక్కడే మతి చెందాడు. సంఘటనా స్థలానికి కందుకూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య, పోలీసులు చేరుకుని పరిశీలించారు. అభినయ్ మృతదేహానికి శవ పరిక్ష నిమితం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.కనీసం భద్రతా ప్రమా ణాలు పాటించకుండా హైవే రోడ్డును నిర్మిస్తున్నటువంటి కాంట్రాక్టర్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తేలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రాయితీపై శనగ విత్తనాలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

రాయితీ పైన శనగ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ధరల వివరాలు వెల్లడించారు. రైతులు దరఖాస్తు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, మొబైల్ నెంబర్ తదితర వివరాలతో సంప్రదించాలని ఆయన సూచించారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

వలేటివారిపాలెం మండలంలోని చుండి గ్రామంలో ఇర పని అంజయ్య కుమారుడు వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి కందుకూరి శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైసిపి కార్యకర్తలు అనుములు వెంకటేశ్వర్లు అనుమలు రవీంద్ర పరిటాల ఈరస్వామి సర్పంచ్ సతీష్ యానాది సంజీవరెడ్డి ఉన్నారు.



వలేటివారిపాలెంలో..

ప్రజాశక్తి - లింగసముద్రం :తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి వెంకటేశ్వర్లు కుమారుడు రాంబాబు,రాజ్యలక్ష్మిల కుమార్తె గాయత్రి వివాహం బుధవారం రాళ్లపాడులో జరిగింది.ఈ వివాహ కార్యక్రమానికి కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం పాల్గొని వధువు గాయత్రిని ఆశీర్వదించారు. మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు, టిడిపి నాయకులు సయ్యద్ నాయబ్ రసూల్,మద్దెల రామారావు,పూరిమిట్ల మాల్యాద్రి,బోయిళ్ల కొండపనాయుడు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ షఫి,మాజీ ఎంపిపి పూరిమిట్ల బాలకోటయ్య ఉన్నారు.



లింగసముద్రం మండలంలో..

జెకె రెడ్డి కుటుంబానికి 'విపిఆర్' పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు

మాజీ శాసనసభ్యులు జెకె రెడ్డి కుటుంబ సభ్యులను వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి దంపతులు పరామర్శించారు. బుధవారం మాగుంట లే అవుట్ ప్రాంతంలోని జెకె రెడ్డి నివాసానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి చేరుకొని మాజీ శాసనసభ్యులు జెకె రెడ్డి సతీమణి సులోచనమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెకె రెడ్డి కుటుంబానికి తమ ప్రగడా సంతాపం తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం 2022-23వ ఏడాదికి ఉపకార వేతనాలు మంజూరు చేసేందుకు అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎ.నిర్మలదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేవారు.

రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కావలి రూరల్

నెల్లూరు నగరంలో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 27న జరుగనున్న అసంఘటిత కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర నాయకులు, మాజీ ఎంఎల్‌సి ఎం.ఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర సీనియర్ నాయకులు ఉమామహేశ్వరరావు హాజరవుతారని సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత, భవన, అమాలీ, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేసే డ్రైవర్లు, రోడ్డు మార్గం తదితర కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సదస్సులో చర్చ జరుగుతుందని తెలిపారు. భవన కార్మికులు మన రాష్ట్రంలో సక్రమంగా పనులు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి వెల్ఫేర్ బోర్డులో డబ్బులు ఉన్నప్పటికీ కార్మికులకు ఇచ్చి ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతేకాకుండా వారి బోర్డులో ఉన్న సుమారు రూ.1280 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వేరే సంక్షేమ పథకాలకు మళ్లించిందని, చాలా అన్యాయమన్నారు. ఆటో కార్మికులు, వీధి వ్యాపారులు కుటుంబ లు గడపక అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వారిని ఆదుకోవడం లేదని తెలిపారు. ఎన్నికలప్పుడు ప్రభుత్వాలు అందరినీ ఆదుకుంటామని ఉపాధి కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు వారి ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు భవన కార్మికులతో పాటు అసంఘటిత కార్మికులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి ద్వారా ఆర్థికసాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 27వ తేదీన జరిగే అసంఘటిత కార్మిక రాష్ట్ర సదస్సుకు భవన కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు అందరూ పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.మధుసూదన రావు, వి.బాబూరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బోగోలును కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలంలో వర్షపాతం నమోదు కాని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయినందున బోగోలు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు, వ్యవసాయ కార్మికులు మద్దతుగా నిరసన కార్యక్రమాన్ని తెలిపి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు నాయకులు నరహరి మాట్లాడుతూ బోగోలు మండలంలో వర్షాలు పడక రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. నిత్యావసర ధరలు, గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని ఏటా 200 రోజులు పెంచాలని, ఉపాధి హామీ కార్మికులకు జాబ్ కార్డులను అందించాలని, సోమశిల ప్రాజెక్టు ద్వారా కాలువలకు నీటిని విడుదల చేయాలని, బోగోలు సిపిఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్‌కె అన్వర్ భాషా, కార్మిక నాయకులు బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో బుధవారం పూర్వ హెచ్ఎంగా విధులు నిర్వహించిన వి.సుబ్బా రావును సత్కరించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎలిమెంట్రీ పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలు అందరూ సుబ్బారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోళ్ల.అమరశ్రీ, వైస్ చైర్మన్ సయ్యద్. షనీబాషా, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్.ఎం. సయ్యద్. హయ్యూల్ హయ్యూమ్, ఎలిమెంట్రీ పాఠశాల హెచ్.ఎం. షేక్.మహబూబ్ మస్తాన్, ఉపాధ్యాయులు టి.కొండారెడ్డి, ఎ.శ్రీనివాసులు, షేక్.జాఫర్ అలీ, అరుణకుమారి, మృదుల, విజయలక్ష్మి, షేక్.సాబీరా, శ్రీలక్ష్మి, రజని, శాంతికుమారి, ఆయాలు షేక్.జరీనా, వీరమ్మ, వంట బాషా తదితరులున్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణానికి నీటి సరఫరా చేసే 600 ఎం.ఎం. పంపు వాల్వ్ జనతాపేట వద్ద మరమ్మతులకు గురైందని, అందువల్ల 26వ తేదీ గురువారం పట్టణంలో నీటిసరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఏర్పడిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు.

ఈసీజీ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక దర్గా సెంటర్ సమీపంలో బుధవారం హబీబియా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ షేక్.ఖాజామియా, డాక్టర్ సిరాజ్ ఆధ్వర్యంలో నూతన ఈసీజీ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రముఖ యాత్ర స్థలంగా ఉన్న ఎఎస్‌పేటలో ఈసీజీ సెంటర్ లేకపోవడంతో రోగులు అత్మకూరు, నెల్లూరు తదితర దూర ప్రాంతాలకు వరుగులు తీస్తుండేవారని, ప్రస్తుతం ఎఎస్‌పేటలోనే ఈసీజీ సెంటర్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ సిరాజ్ తెలిపారు. స్థానిక ముస్లిం పెద్దలు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆర్‌ఎంపీలు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-జలదంకి : మహిళలు గర్భం దాల్చిన మూడో నెల నుంచి సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సాధారణ కాన్పుతో పాటు, తల్లీబిడ్డ ఆరోగ్యంగా క్షేమంగా ఉంటారని ఐసిడిఎస్ వింజమూరు సిడిపిఒ పద్మజకుమారి స్పష్టం చేశారు. బుధవారం జలదంకి మండలంలోని చిన్నక్రాక సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు చిన్నారులకు అందజేస్తున్న సేవలు తెలియజేయడంతో పాటు, పౌష్టికాహారంపై స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఒ పద్మజకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ బాబు, ఎంఇఒ శ్రీధర్, అరిటకట్ల ఎఇ నారాయణ, సర్పంచ్ పులి సుష్మిత, నాయకులు పులి భాస్కర్, డాక్టర్లు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, విఆర్‌ఒ బాలకోటయ్య, సిబ్బంది, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కలిగిరి : విజయదశమిని పురస్కరించుకొని బండారు యానాదయ్య, వరమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బుధవారం బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి పెద్దూర్ సిక్సర్స్ కలిగిరి వారికి రూ.15,116 సచివాలయ మండల కన్వీనర్ చే రెడ్డి సుబ్బారెడ్డి, సెకండ్ బహుమతి మహాలక్ష్మి సీనియర్స్ రూ.10116, నరాల అంకిరెడ్డి, గంజాం పోలయ్య, తృతీయ బహుమతి కొండాపురం క్రీడాకారులకు రూ.5116 పొన్నం నాగేశ్వరరావు అందజేశారు. వైసిపి టౌన్ అధ్యక్షుడు బండారు మల్లికార్జున, నిర్వాహకులు బండారు మధు మంజున్, బండారు మహేష్, సతీష్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-సంగం : నెల్లూరు నుంచి సంగంకు వస్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటన బుధవారం మండలంలోని దువ్వూరు వద్ద చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మైపాడు బీచ్ కి వెళ్లి తిరిగి వస్తున్న ఆటోను డిసిపల్లి నుండి నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఒకరికి తీవ్ర గాయాలు కాగా, వారిని ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

ఎస్ఐను కలిసిన వైసిపి నేత

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చి మండలం పోలీస్ స్టేషన్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మహేంద్ర నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ చల్లా సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తా క్రైమ్ సమస్యలు లేకుండా లాండ్ ఆర్డర్‌ను పర్యవేక్షిస్తూ నగర పంచాయతీని ప్రశాంతంగా ఉంచుతానని తెలిపారు.

వైభవంగా విమాన శిఖర ప్రతిష్ఠ



ప్రజాశక్తి-కోవూరు : పట్టణ పరిధిలోని గాంధీ పార్క్ సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి పునః ప్రతిష్ఠ బుధవారం దేవస్థానంలో మహా కుంభాభిషేకం విమాన శిఖర నూతన ప్రతిష్ఠ అభిషేకం కార్యక్రమాలు కనులు విందుగా నిర్వహించి పర్యవేక్షణలో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కష్టారెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఆర్‌డిఒను కలిసిన రాములు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నూతన ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన మధులతను బుధవారం ఆత్మకూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అలాగే మర్రిపాడు మండలం కృష్ణాపురం మాజీ సర్పంచ్ ముట్టుకుంటు లక్ష్మీరెడ్డి ఆర్‌డిఒను మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్స్ అందజేశారు.

వరికుంటపాడు వైసిపిలో విభేదాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండల వైసిపిలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఇదిలా ఉండగా కన్వీనర్ విషయంలో డోలాయమానం నెలకొంది. ఒక వర్గానికి మాజీ ఎఎంసి చైర్మన్ అలీఅహ్మద్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరొక వర్గానికి కన్వీనర్ బాలగురువారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఈ రెండు వర్గాలలో కొత్తగా కన్వీనర్ విషయం లో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వైఎసార్ ప్రభుత్వం వచ్చిన సమయంలో కన్వీనర్‌గా కాంచెరువుకు చెందిన మండలపు తిరుపతినాయుడు కొనసాగుతున్నారు. రెండేళ్ల తర్వాత కొన్ని పరిణామాలతో ఆయనను తొలగించి వరికుంటపాడుకు చెందిన ఆంధ్ర బాల గురువారెడ్డికి ఆ పదవిని కట్టబెట్టారు. ప్రస్తుతం ఆయనే కొనసాగుతున్నారు. ఒక నెల రోజుల నుండి రెండు వర్గాలలో ఎవరికి వారే కన్వీనర్ నేనంటే.. నేనంటూ.. చెప్పుకుంటు వస్తున్నారు. అలీ వర్గం నుండి మాజీ కన్వీనర్‌గా కొనసాగుతున్న మండలపు తిరుపతినాయుడుని తిరిగి కన్వీనర్ పదవికి ఉదయగిరి నియోజకవర్గ మేకపాటి రాజగోపాల్ రెడ్డి తనను నియమించాడని, అన్నింటా కన్వీనర్‌గా ఆయనే వ్యవహరిస్తున్నారు. ఒక వర్గానికి అర్థం పోస్తున్నాడు. కన్వీనర్ పదవి నుండి తొలగించలేదని తానే కన్వీనర్ అని ప్రస్తుతం కొనసాగుతున్న ఆంధ్రా బాలగురువారెడ్డి కూడా తానే కన్వీనర్‌గా చెప్పుకుంటున్నారు. వివరికి వివరి జగన్ ఏ ఎందుకు కావాలి అనే కార్యక్రమాలలోనూ రెండు వర్గాలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో బాలగురువారెడ్డి వర్గం మంగళవారం రాత్రి కన్వీనర్ హోదాలో సమావేశం నిర్వహించి కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్ధేశాలు చేశారు. ఇదిలా ఉండగా అలీఅహ్మద్ వర్గం బుధవారం అదే సమావేశాన్ని మరొకచోట మందలపు తిరుపతి నాయుడు కన్వీనర్ హోదాలో నిర్వహించారు. కన్వీనర్ ఎవరో అనే అయోమయంలో కార్యకర్తలు, నాయకులకు మింగుడు పడడం లేదు.

తొలగించిన జాబ్ కార్డులను పునరుద్ధరించాలి



ప్రజాశక్తి-జలదంకి

తొలగించిన ఉపాధి హామీ జాబ్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలి అని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. జలదంకి పంచాయతీలోని పూనూరు వాగు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం సిపిఎం నాయకులు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను, కూలీల కష్టాన్ని చూసి చలించిపోయారు. ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం ఇస్తున్న కూలీ వేతనం తమకు సరిపోవటం లేదంటూ, పని భారం కూడా అధికంగా ఉంటుందని కూలీలు నాయకుల వద్ద తమ ఆవేదనను వెలిబుచ్చారు. అక్కడ కూలీల దుస్థితిని చూసి సిపిఎం నాయకులు చలించి పోయారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కూలీలు పెంచేలా చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలతో పోరు బాట చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. ఉపాధి కూలీలకు 5, 6 వారాల నుంచి కూలీ డబ్బులు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్.మధు, షేక్ బాదుల్లా, ఎస్.కె చాన్, మదన్మోహన్, కూలీలు పాల్గొన్నారు.

విలేకరులకు మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించాలి



ప్రజాశక్తి-కావలి : జిల్లాలో విలేకరు లకు, వారి కుటుంబ సభ్యులకు సుస్తీ చేసినప్పుడు తక్షణం అందుబాటులోకొచ్చే విధంగా విలువైన మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించాలని కావలి నియోజకవర్గ ఎపిడబ్ల్యూజెఎఫ్ సమావేశం తీర్మానించింది. బుధవారం స్థానిక జి.డి. కాంప్లెక్స్ ఆవరణంలోని 226 నెంబర్ హాల్లో ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్. నియోజకవర్గ విలేకరుల జనరల్ బాడీ సమావేశం కందికట్ల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఫెడరేషన్ జిల్లా నాయకులు పి.బాలకృష్ణ, సుధాకరరావు, శ్రీధర్ రెడ్డి, మనోహర్ పాల్గొని ఫెడరేషన్ కార్యకలాపాలను, విధులను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విలేకరులు తమకు అక్రిడిటేషన్లు ఇప్పించాలని, జీవిత కాలి ఎం.ఎల్.ఎ విలేకరులకు చూపించిన ప్లాట్లకు యూనియన్ బాధ్యులు కృషి చేసి, అధికారులతో మాట్లాడి, పట్టాలు, పొజిషన్లు వచ్చేలా పనిచేయాలని కోరారు. అందుకు జిల్లా బాధ్యులు స్పందిస్తూ, నియోజకవర్గ ఫెడరేషన్ బాధ్యుల ఆధ్వర్యంలో వస్తే, విలేకరుల సమస్యలను జిల్లా సంఘం పరిష్కరించేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గం నుండి ఆరుగురితో ఆడహాక్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో కె.నారాయణ, సిహెచ్.కిషోర్, గర్రె వెంకటేశ్వర్లు, హెూనోక్ పాల్, జ్యోతిబాల అంకులు, ఎస్.ఎ. నవీద్‌లు సభ్యులుగా ఉన్నారు. సమావేశంలో కావలికి చెందిన 30మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి సచివాలయం లో వైసిపి మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులను ఆరోగ్య కార్యకర్తలను పంపడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుత జీవన శైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో వాటిని గుర్తించి మెరుగైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 7రకాల పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తించి రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో పలు రకాల పరీక్షలతో పాటు కంటి సంబంధిత పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగమణి, తహశీల్దారు ఆనందరావు, సర్పంచ్ రేవూరు సుప్రజ, నందవరం సర్పంచ్ రామ్మోహన్, వైసిపి నాయకులు చిట్టెం శ్రీను, రేవూరు గోపి, మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెవుల శ్రీనివాసులు యాదవ్, గ్రామ సచివాలయ, వైద్య, ఐసిడిఎస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలోని సిద్ధీపురంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ గోపి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురక్ష వైద్య శిబిరంలో వైద్య బృందం ప్రజలకు పలురకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకే వైద్య సేవలు అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడని ఆయన కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండడం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించారని జెసిఎస్ మండల కన్వీనర్ పులిమి వెంకట రమేష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిఎస్ మండల కన్వీనర్ పులిమి వెంకట రమేష్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వరోగ నివారణ కోసం ప్రతిఒక్కరికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని, ఆపత్కర సమయాల్లో అప్పటికప్పుడు చేయించు కుంటే కుటుంబ పెద్దను కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి వైద్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ముందే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న జగన్నన ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి ఎంపిడిఒ భాస్కర్, నాయకులు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, కాటం తిరుపతిరెడ్డి, వైద్యాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని కొత్త వంగల్లులో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా సాగిన ఈ కార్యక్రమంలో 677 మందికి వైద్య సేవలందుకొన్నారు. వైద్య నిపుణులు రాజేష్ రెడ్డి మనీష్ శశికళ పిహెచ్‌సి వైద్యులు ఎం రామకృష్ణ లత కావ్యాలు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నేత చక్కా మనోహర్ బాబు, సర్పంచ్ అమవరపు సింధు, ఎంపిటిసి నంబూరి ప్రసాద్, ఉప సర్పంచులు చక్కా శైలజ, మధు రెడ్డి, నాయకులు వేముల వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్రీనివాసులు రెడ్డి, వేముల నవీన్, పంచాయతీ కార్యదర్శి శివమణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గజాల తాజుద్దీన్

ప్రజాశక్తి-ఉదయగిరి : బిట్ -2 సచివాలయం పరిధిలోని ఎంపిడిఒ ఆవరణంలోని డిడబ్ల్యు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు షేక్.గాజుల తాజుద్దీన్, జిల్లా ఎడిసిసి డైరెక్టర్ షీట్లి సలీం పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీని ఉదయగిరి నుండి ప్రారంభించడంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అందుకు భిన్నంగా ఒక అడుగు ముందుకేస్తూ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పేద మధ్యతరగతి ప్రజలకు ఇంటి వద్దకే ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులను వివిధ రకాల వ్యాధులకు కార్పొరేట్ వైద్యం అందించడానికి అన్నిరకాల వైద్యులను నియమించి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నారన్నారు. ఇంతగా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరి నవరత్నాల పేరుతో ప్రతిఒక్కరికీ అందిస్తూ అండగా నిలుస్తున్నారని 2024 ఎన్నికల్లో రెండవసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉదయగిరి మెట్ట ప్రాంత అభివృద్ధికి ఆనాడే విద్య అవసరమని గుర్తించిన మేకపాటి రాజమోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన నవోదయ డిగ్రీ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ అగ్రికల్ కాలేజీని నియమించిన కుటుంబ సభ్యుల మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఎంఎల్ఏగా గెలిపించుకునే అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం శిశుసంక్షేమ శాఖ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి మల్లికార్జున, ఇఒ నరసయ్య, ఎంపిటిసి మట్ల శాంతి, లక్ష్మయ్య, మండల కోఆప్షన్ సభ్యులు సుభాని, వైద్యులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

'ఆర్థిక అక్షరాస్యత'పై సదస్సు


మాట్లాడుతున్న మేనేజర్ కృష్ణకుమార్

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని ఉద్దీపుగుంట గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అల్లూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ నాబార్డ్ సౌజన్యంతో ఆర్థికసాంకేతిక అక్షరాస్యత సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఈ సదస్సు ఖాతాదారులకు బ్యాంక్ అందించే సేవలు, వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు, చేయూత, ఖాతాదారుల పొదుపు వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. ఖాతాదారులు వారి వద్ద ఉన్న నగదును ఫిక్సిడ్ డిపాజిట్ ద్వారా బ్యాంకులో దాచుకొని వారి నగదుకు తగిన మద్దతుతో పాటు వడ్డీని కూడా తీసుకోవచ్చని తెలిపారు. తోలు బొమ్మలాట ద్వారా ఖాతాదారులకు బ్యాంకు అందించే సేవలు పాటల రూపంలో వివరించారు. తోలు బొమ్మలాట అందరినీ ఆకట్టుకొంది. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ టి.మోహన్, నోడల్ ఆఫీసర్ మల్లికార్జున, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివా సులు, సిసి సురేష్, విఒఎ విజయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని జి.అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ దొనబాబు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ సౌజన్యంతో చైతన్య జానపద కళాబృందంతో బ్యాంకు పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి ప్రధానమంత్రి జీవన సురక్షిత అటల్ పెన్షన్ పథకాలపై అవగాహన కల్పిస్తూ విద్యా వ్యాపారం గృహ రుణాలను తక్కువ వడ్డీకే ఆంధ్ర ప్రగతి బ్యాంక్ అందిస్తున్నామన్నారు. పొదుపు మహిళలకు ఎక్కువగా రుణాలు ఇచ్చి బ్యాంకు తోడ్పాటిస్తుందన్నారు. రైతులకు పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకొని రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీరో బ్యాలెన్స్ అకౌంట్లను బ్యాంకు మిత్ర దగ్గర ఓపెన్ చేయించుకోవచ్చని, ఎటిఎం కార్డులు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, బిసి నాయకులు కోఆర్డినేటర్ అన్వర్ భాషా, ఖాతాదారులు పాల్గొన్నారు.

31వ వార్డులో 'బాబుతో నేను'




ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం బుధవారం 31వ వార్డు వైకుంఠపురంలో టిడిపి శ్రేణులు "బాబుతో నేను" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి, వ్యాపారస్తుల వద్దకు వెళ్లి కరపత్రాలను పంచారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు ప్రతిఒక్కరూ సంఘీభావం తెలియజేయాలని కోరారు. వార్డు ఇన్‌ఛార్జి మంచాల ప్రసాద్, వార్డు అధ్యక్షులు మక్కెన హరిబాబు, పార్టీ ముఖ్య నాయకులు పులివర్తి రవీంద్ర, శోభన్, వెంగయ్య, కళ్యాణ్, సురేంద్ర పాల్గొన్నారు.

ఎంపి ఆదాలకు సన్మానం



ప్రజాశక్తి-ఉదయగిరి : పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర రెడ్డి జన్మదినం సందర్భంగా నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురవారెడ్డి మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో ఇటువంటి పుట్టినరోజులు జరుపుకోవాలని, రాజకీయంగా మరెన్నో ఉన్నత శిఖరాలు చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి అల్లూరు రాజు, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య, ఉదయగిరి నియోజకవర్గ వైసిపి యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి, సీతారామపురం వైసిపి నాయకులు బేరి భాస్కర్ రెడ్డి, నెల్లూరు సిటీ నాయకులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాలకు దాసరి పోలయ్య జన్మదిన శుభాకాంక్షలు



ప్రజాశక్తి-అల్లూరు : నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా అల్లూరు ఎస్‌టి సెల్ నాయకులు దాసరి పోలయ్య బుధవారం నెల్లూరులోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాలతో సత్కరించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనవెంట నాయకులు పాల్గొన్నారు .

ఎస్‌సి, ఎస్‌టిలపై కక్ష సాధింపు తగదు


మాట్లాడుతున్న ఎస్ మల్లి

ప్రజాశక్తి-కావలి : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎస్.సి, ఎస్.టి పిల్లలపై, జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళిత గిరిజన బిడ్డలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలు తగవని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 2008 సంవత్సరం నుంచి "బెస్ట్ అవైలబుల్ స్కూలు"ను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించి, ఆ డబ్బులు సంవత్స రానికి రూ.50వేలు ప్రభుత్వమే చెల్లించేదని తెలిపారు. ఆ విధంగా 2019 వరకు కొనసాగిందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎస్.సి., ఎస్.టి. పథకాలను రద్దు చేసిన విధంగానే ఈ పథకాన్ని కూడా రద్దు చేశారని తెలిపారు. అంతే కాకుండా పిల్లలు బకాయిలు ఉంటే ఆయా స్కూళ్ల యాజమాన్యం పిల్లల దగ్గరే వసూలు చేయించాడని తెలిపారు. జిల్లాలో 2వేల మంది దళిత గిరిజన 5వ తరగతి వరకు కార్పొరేట్ స్కూళ్లలో ఉన్నప్పటికీ ఈ పథకం రద్దు చేయడం వల్ల స్కూళ్లు నుండి పిల్లలను అర్థాంతరంగా బయటకు పంపించి వేశారని తెలిపారు. ఈ విషయంపై విజయానంద్ అనే తల్లిదండ్రులు కమిటీ ద్వారా హైకోర్టులో దావా వేసి గెలిచినారన్నారు. హైకోర్టులో కూడా జగన్మోహన్ రెడ్డి ఈ పథకం అమలు చేయకూడదని కోట్ల రూపాయలు లాయర్లు ఇచ్చి వాదనలు జరిపించారు. ఇక్కడ అమలు చేయకుండా సుప్రీంకోర్టుకు అప్పీలు చేశారని తెలిపారు. బేల్దారి, కూలి పనులు, చెక్కబండి కూలీలు, బేల్దారి మేస్త్రీలు ఒక కమిటీగా ఏర్పడి సుప్రీం కోర్టులో కూడా దావా వేసి గెలిచారని తెలిపారు. సుప్రీంకోర్టులో కూడా లాయర్లకు రూ.10 కోట్లు ఖర్చు పెట్టి వాదించి కూడా ఓడిపోయారని తెలిపారు. అధికారులు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని జి.ఒ. నెంబర్ 61 తీసుకొచ్చి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, ఎం.మోహన్ రావు, అశోక్, చలంచర్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.